08-01-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - తండ్రి స్మృతిలో ఉంటూ సదా హర్షితముగా ఉండండి, స్మృతిలో ఉండేవారు చాలా రమణీకముగా మరియు మధురముగా ఉంటారు, సంతోషములో ఉంటూ సేవ చేస్తారు"

ప్రశ్న:- జ్ఞానపు నషాతో పాటుగా ఏ చెకింగ్ ను చేయడం ఎంతో అవసరం?

జవాబు:- జ్ఞానపు నషా అయితే ఉంటుంది కానీ చెక్ చేసుకోండి - దేహీ అభిమానిగా ఎంతవరకూ అయ్యారు? జ్ఞానమైతే చాలా సహజమైనది, కానీ యోగములోనే మాయ విఘ్నాలను కలిగిస్తూ ఉంటుంది. గృహస్థ వ్యవహారములో అనాసక్తులుగా ఉండాలి. మాయ ఎలుక లోలోపలే కొరికివేస్తున్నా బయటకు ఏమీ తెలియకుండా ఉండడం కాదు. మీ నాడిని మీరే చూసుకుంటూ ఉండండి - బాబాపై నాకు లోతైన ప్రేమ ఉందా? నేను ఎంత సమయం స్మృతిలో ఉంటున్నాను?

పాట:- దీపపు పురుగు దీపములో ఎందుకు దగ్గమవ్వలేదు... (జలే క్యా నా పర్వానా...)

ఓం శాంతి. మధురాతి-మధురమైన పిల్లలు పాటలోని లైనును విన్నారు. తండ్రి ఇంతటి సత్తాను చూపిస్తున్నప్పుడు, మీరు ఇంత సుందరముగా తయారవుతున్నప్పుడు, మరి ఇటువంటి తండ్రికి చెందినవారిగా ఎందుకు అయిపోకూడదు? ఈ తండ్రి నల్లగా ఉన్నవారి నుండి సుందరముగా తయారుచేస్తారు. మేము నల్లగా ఉన్నవారి నుండి తెల్లగా అవుతాము అని పిల్లలు భావిస్తారు. ఇది ఏ ఒక్కరి విషయమో కాదు. వారు శ్రీకృష్ణుడిని శ్యామసుందరుడు అని అంటారు. చిత్రాలను కూడా అదే విధముగా తయారుచేస్తారు. కొన్నింటిని సుందరముగా, కొన్నింటిని శ్యామముగా తయారుచేస్తారు. కానీ అలా ఎలా జరుగగలదు అన్నది మనుష్యులు అర్థం చేసుకోరు. సత్యయుగ యువరాజైన శ్రీకృష్ణుడు నల్లగా ఉండరు. శ్రీకృష్ణుని విషయములో అందరూ శ్రీకృష్ణుడి వంటి పుత్రుడు కావాలని, పతి లభించాలని కోరుకుంటారు. మరి అటువంటప్పుడు అతను నల్లనివాడిగా ఎలా అవ్వగలరు. ఏమీ అర్థం చేసుకోరు. శ్రీకృష్ణుడిని నల్లగా (శ్యామముగా) ఎందుకు తయారుచేసారు? దానికి కారణం కావాలి. సర్పముపై నాట్యం చేసినట్లుగా ఏదైతే చూపిస్తారో, వాస్తవానికి అటువంటి విషయమేదీ జరుగదు. శాస్త్రాలలో ఇటువంటి విషయాలను విని అలా అనేస్తారు. వాస్తవానికి అటువంటి విషయాలేవీ లేవు. శేషనాగు శయ్య పైన నారాయణుడు కూర్చున్నారని చిత్రాలలో చూపిస్తారు కానీ అటువంటి సర్పము యొక్క శయ్య మొదలైనవేమీ ఉండవు. సర్పానికి ఇన్ని వందలాది ముఖాలు ఏమైనా ఉంటాయా? వారు కూర్చొని ఎటువంటి చిత్రాలను తయారుచేసారో చూడండి. తండ్రి అర్థం చేయిస్తారు - వీటిలో అసలు అర్థమేమీ లేదు, ఇవన్నీ భక్తి మార్గపు చిత్రాలు. కానీ ఇది కూడా డ్రామాలో నిశ్చితమై ఉంది. ప్రారంభం నుండి మొదలుకుని ఇప్పటివరకూ ఏ నాటకమైతే షూటింగ్ అయ్యిందో, అది మళ్ళీ పునరావృతమవ్వాలి. కేవలం - భక్తిలో ఏమేమి చేస్తారు అనేది అర్థం చేయించడం జరుగుతుంది. ఎంత ఖర్చు చేస్తారు. ఎలాంటి-ఎలాంటి చిత్రాలు మొదలైనవాటిని తయారుచేస్తారు. ఇంతకుముందు ఇవన్నీ చూసేటప్పుడు అంతగా ఆశ్చర్యపోయేవారు కాదు. ఇప్పుడు తండ్రి అర్థం చేయించిన తర్వాత బుద్ధిలోకి వస్తుంది - తప్పకుండా ఇవన్నీ భక్తి మార్గపు విషయాలే అని. భక్తిలో ఏదైతే జరుగుతుందో అది మళ్ళీ తప్పకుండా జరుగుతుంది. మీరు తప్ప ఇంకెవ్వరూ ఈ విషయాలను అర్థం చేసుకోలేరు. డ్రామాలో ఏదైతే ముందు నుండే నిశ్చితమై ఉందో అదే జరుగుతూ ఉంటుంది అని మీకు తెలుసు. అనేక ధర్మాల వినాశనం మరియు ఏక ధర్మ స్థాపన జరుగుతుంది. ఇందులో ఎంతో కళ్యాణము ఉంది. ఇప్పుడు మీరు ఈ ప్రార్థనలు మొదలైనవేవీ చేయరు. అవన్నీ భగవంతుడి నుండి ఫలాన్ని తీసుకునేందుకై చేస్తారు. ఆ ఫలము జీవన్ముక్తి, కావున ఈ విషయాలన్నీ అర్థం చేయించడం జరుగుతుంది. ఇక్కడ ఇది ప్రజలపై ప్రజల రాజ్యం. భారతవాసులైన కౌరవులు మరియు పాండవులు ఏమి చేసారు అని గీతలో ఉంది. తప్పకుండా యాదవులు మిసైల్స్ ను కనుగొన్నారు. తమ కులాన్ని వినాశనం చేసారు. వారంతా పరస్పరం శత్రువులు. మీరు వార్తలు మొదలైనవి వినరు, ఎవరైతే వింటారో వారు బాగా అర్థం చేసుకోగలుగుతారు. రోజురోజుకు లోలోపల ఎన్నో గొడవలు జరుగుతూ ఉంటాయి. వాస్తవానికి అందరూ క్రిస్టియన్లే కానీ లోలోపల గొడవలైతే ఎన్నో ఉన్నాయి. ఇంట్లో కూర్చునే ఒకరినొకరు హతమార్చుకుంటారు. మీరు రాజయోగాన్ని నేర్చుకుంటున్నారు కావున రాజ్యం చేయడానికి పాత ప్రపంచం తప్పకుండా శుభ్రమవ్వాలి. ఆ తర్వాత కొత్త ప్రపంచములో అంతా కొత్తగా ఉంటుంది. పంచ తత్వాలు అక్కడ సతోప్రధానముగా ఉంటాయి. ఉప్పొంగుతూ నష్టపరిచేంతటి శక్తి సముద్రానికి ఉండదు. ఇప్పుడైతే పంచ తత్వాలు ఎంతగా నష్టపరుస్తున్నాయి. అక్కడ మొత్తం ప్రకృతి అంతా దాసిగా అయిపోతుంది, అందుకే దుఃఖము యొక్క విషయమేదీ లేదు. ఇది కూడా

తయారై-తయారుచేయబడిన డ్రామా ఆట. స్వర్గము అని సత్యయుగాన్నే అంటారు. క్రిస్టియన్లు కూడా - మొట్టమొదట స్వర్గము ఉండేది అని అంటారు. భారత్ అవినాశి ఖండము, కానీ తమను విముక్తులుగా చేసే తండ్రి భారత్ లోకి వస్తారు అన్న విషయము మాత్రము వారికి తెలియదు. శివజయంతిని కూడా జరుపుతారు, అయినా కానీ అర్థం చేసుకోలేరు. ఇప్పుడు మీరు అర్థం చేయిస్తారు - భారత్ లో శివజయంతి జరుపబడుతుంది అంటే తప్పకుండా శివబాబా భారత్ లోకి వచ్చి స్వర్గాన్ని తయారుచేసారు, ఇప్పుడు మళ్ళీ తయారుచేస్తున్నారు. ప్రజలుగా తయారయ్యేవారు ఎవరైతే ఉంటారో, వారి బుద్ధిలో ఏమీ కూర్చోదు. రాజధానికి చెందినవారు ఎవరైతే ఉంటారో, వారు - తప్పకుండా మేము శివబాబా పిల్లలము అని భావిస్తారు. ప్రజాపిత బ్రహ్మ కూడా ఉన్నారు. ముక్తిప్రదాత, జ్ఞాన సాగరుడు స్వయంగా బాబాయే. బ్రహ్మను అలా అనరు. బ్రహ్మ కూడా వారి ద్వారా ముక్తిని పొందుతారు. అందరినీ ఒక్క తండ్రే విముక్తులుగా చేస్తారు ఎందుకంటే అందరూ తమోప్రధానముగా ఉన్నారు. ఈ విధముగా లోలోపల విచార సాగర మథనము జరగాలి. మనము ఏ విధముగా మురళీని వినిపించాలంటే, దాని ద్వారా మనుష్యులు వెంటనే అర్థం చేసుకోగలగాలి. పిల్లలు నంబరువారుగా అయితే ఉండనే ఉన్నారు. ఇది జ్ఞానము, దీనిని రోజూ అధ్యయనం చేయాలి. భయపడి చదువును చదవకపోవడమనేది కరెక్టు కాదు. అలా చేస్తే ఇక దానిని కర్మబంధనం అని అంటారు. ప్రారంభములో ఎంతమంది అన్నీ వదిలేసి వచ్చారో చూడండి. ఆ తరవాత కొందరు వెళ్ళిపోయారు కూడా. సింధ్ లో చాలామంది పిల్లలు వచ్చారు, తర్వాత గొడవలు కారణంగా ఎంతమంది శత్రువులుగా అయిపోయారు. మొదటిలో వారికి జ్ఞానం చాలా బాగా అనిపించేది. వీరికి భగవంతుని ద్వారా కానుక లభించింది అని భావించేవారు. ఇప్పుడు కూడా ఏదో శక్తి ఉంది అని భావిస్తారు, కానీ పరమాత్మ ప్రవేశించారు అని భావించరు. ఈ రోజుల్లోనైతే మంత్ర-తంత్రాల శక్తి ఎంతో మందిలో ఉంది. గీతను తీసుకొని వినిపిస్తూ ఉంటారు. తండ్రి అంటారు, ఇవన్నీ భక్తి మార్గపు పుస్తకాలు. జ్ఞానసాగరుడినైతే నేనే. నన్నే భక్తి మార్గంలో అందరూ తలచుకుంటారు. డ్రామా ప్లాన్ అనుసారంగా ఇది కూడా డ్రామాలో నిశ్చితమై ఉంది. సాక్షాత్కారాలు కూడా జరుగుతూ ఉంటాయి. భక్తి మార్గం వారిని కూడా రాజీ పరుస్తారు. జ్ఞానం తీసుకోకపోతే, అటువంటివారికి భక్తి అయినా మంచిదే. దాని వలన మనుష్యులు ఎంతో కొంత బాగుపడతారు కదా. దొంగతనాలు మొదలైనవి చేయరు. భగవంతుని భజనను చేసేవారి గురించి ఎప్పుడూ తప్పుగా మాట్లాడరు. ఎంతైనా వారు భక్తులే కదా. ఈ రోజుల్లో భక్తులుగా ఉన్నా కానీ ఎంతోమంది దివాలా తీస్తూ ఉంటారు. శివబాబా పిల్లలుగా అయ్యారు కావున దివాలా తీయరు అని ఏమీ కాదు. గత కర్మలు ఆ విధంగా ఉంటే తప్పకుండా దివాలా తీస్తారు. జ్ఞానంలోకి వచ్చినా కూడా దివాలా తీస్తారు. దీనికి జ్ఞానంతో సంబంధం ఏమీ లేదు.

పిల్లలైన మీరు ఇప్పుడు సేవలో నిమగ్నమై ఉన్నారు. శ్రీమతమనుసారముగా సేవలో నిమగ్నమవ్వడం ద్వారా ఫలాన్ని పొందుతారని భావిస్తారు. మనం సర్వస్వాన్ని అక్కడకు ట్రాన్స్ఫర్ చేయాలి. బ్యాగ్ బ్యాగేజీనంతటినీ ట్రాన్స్ఫర్ చేసుకోవాలి. బాబాకు ప్రారంభములో ఎంతో ఆనందము కలిగింది. అక్కడి నుండి ఎప్పుడైతే వచ్చారో అప్పుడు ఒక పాటను తయారుచేసారు - మొదటివానికి అల్లా లభించారు, రెండవవానికి వారసత్వము లభించింది. శ్రీకృష్ణుని, చతుర్భుజుని సాక్షాత్కారము జరిగింది. అప్పుడు, నేను ద్వారకకు చక్రవర్తిగా అవుతాను అని భావించారు. ఇలా నషా కలిగేది. ఇప్పుడు ఇక ఈ వినాశీ ధనాన్ని ఏం చేసుకోను. కావున పిల్లలైన మీకు కూడా సంతోషము ఉండాలి. మనకు బాబా స్వర్గ రాజ్యాధికారాన్ని ఇస్తారు, కానీ పిల్లలు అంతటి పురుషార్థమునే చేయరు. నడుస్తూ-నడుస్తూ కింద పడిపోతారు. మంచి-మంచి పిల్లలు, బాబాకు ఆహ్వానాన్ని ఇచ్చేవారు కూడా బాబాను ఎప్పుడూ స్మృతి చేయరు. బాబా వద్దకు ఉత్తరాలు రావాలి - బాబా, మేము ఎంతో సంతోషముగా ఉన్నాము. మీ స్మృతిలో నిమగ్నమై ఉంటున్నాము. ఎప్పుడూ స్మృతి చేయనివారు ఎందరో ఉన్నారు. స్మృతి యాత్ర ద్వారానే సంతోషము ఎంతో కలుగుతుంది. జ్ఞానంలో ఎంతగా నిమగ్నమై ఉన్నా కానీ దేహాభిమానము ఎంత ఉంది. దేహీ అభిమాన స్థితి ఎక్కడ ఉంది? జ్ఞానమైతే చాలా సహజమైనది. యోగములోనే మాయ విఘ్నాలను కలిగిస్తుంది. గృహస్థ వ్యవహారములో కూడా అనాసక్తులుగా ఉండాలి. మాయ దెబ్బ తీసే విధముగా ఉండకూడదు. మాయ ఎలుక వలె కొరుకుతూ ఉంటుంది. ఎలుక ఎలా కొరుకుతుందంటే, దాని వల్ల రక్తం బయటకు వచ్చినా కానీ ఏమీ తెలియదు. దేహాభిమానం రావడం వలన ఎంతటి నష్టం వాటిల్లుతుందో పిల్లలకు తెలియదు. ఉన్నత పదవిని పొందలేరు. తండ్రి నుండి పూర్తి వారసత్వాన్ని తీసుకోవాలి. మమ్మా-బాబా వలె మనం కూడా సింహాసనాధికారులుగా అవ్వాలి. తండ్రి హృదయాన్ని తీసుకునేవారు. దిల్వాడా మందిరములో కూడా పూర్తి స్మృతి చిహ్నము ఉంది, లోపల ఏనుగులపై మహారథులు కూర్చున్నారు. మీలో కూడా మహారథులు, గుర్రపు స్వారీ వారు, పాదచారులు ఉన్నారు. ప్రతి ఒక్కరూ తమ-తమ నాడిని చూసుకోవాలి. బాబా ఎందుకు చూడాలి? మిమ్మల్ని మీరు చూసుకోండి - నేను బాబాను స్మృతి చేస్తున్నానా మరియు బాబా వంటి సేవను చేస్తున్నానా, నాకు బాబాతో యోగము ఉందా! రాత్రి మేల్కొని తండ్రిని స్మృతి చేస్తున్నానా? నేను అనేకుల సేవను

చేస్తున్నానా? చార్టు పెట్టుకోవాలి - నేను బాబాను ఎంత లోతుగా స్మృతి చేస్తున్నాను? కొందరు, మేము నిరంతరమూ స్మృతి చేస్తున్నాము అని భావిస్తారు కానీ అది జరుగదు. కొందరేమో - మేము బాబాకు పిల్లలుగా అయిపోయాము, ఇది చాలు అని భావిస్తారు. కానీ స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయాలి. బాబా స్మృతి లేకుండా ఏదైనా పనిని చేస్తే అది బాబాను స్మృతి చేయనట్లే. బాబా స్మృతిలో సదా హర్షితముగా ఉండాలి. స్మృతిలో ఉండేవారు సదా రమణీకముగా, హర్షితముఖులుగా ఉంటారు, అటువంటివారు ఎవరికైనా ఎంతో సంతోషముతో మరియు రమణీకతతో అర్థం చేయిస్తారు. సేవ అంటే ఎంతో అభిరుచి ఉన్నవారు చాలా కొద్దిమందే ఉన్నారు. చిత్రాలపై అర్థం చేయించడం చాలా సహజం. వీరు ఉన్నతోన్నతుడైన భగవంతుడు మరియు వీరి రచన అయిన ఆత్మలైన మనమందరమూ సోదరులము. ఇది బ్రదర్ హుడ్ (సోదర భావము). వారేమో అందరూ తండ్రులే అని అనేసారు. మొదట శివబాబా చిత్రముపై అర్థం చేయించాలి - వీరు సర్వాత్మలకు తండ్రి అయిన పరమపిత పరమాత్మ నిరాకారుడు. ఆత్మ అయిన మనము కూడా నిరాకారియే. భృకుటి మధ్యలో ఉంటాము. శివబాబా కూడా ఒక నక్షత్ర రూపుడే కానీ ఆ నక్షత్రానికి పూజ ఎలా జరుగగలదు? కావుననే పెద్దగా తయారుచేస్తారు. అంతేకానీ ఆత్మ ఎప్పుడూ 84 లక్షల జన్మలను తీసుకోదు. తండ్రి అర్థం చేయిస్తారు - ఆత్మ మొదట అశరీరిగా వస్తుంది, ఆ తర్వాత శరీరాన్ని ధారణ చేసి పాత్రను అభినయిస్తుంది. సతోప్రధాన ఆత్మ పునర్జన్మలు తీసుకుంటూ, తీసుకుంటూ ఇనుపయుగములోకి వచ్చేస్తుంది. తరవాత వచ్చేవారైతే 84 జన్మలు తీసుకోరు. అందరూ 84 జన్మలను తీసుకోలేరు. ఆత్మయే ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటుంది. నామ, రూప, దేశ, కాలాలన్నీ మారిపోతాయి. ఈ విధముగా భాషణ చేయాలి. సెల్ఫ్ రియలైజేషన్ అని అంటారు కానీ అది చేయించేది ఎవరు? ఆత్మయే పరమాత్మ అని అనడమంటే అదేమైనా సెల్ఫ్ రియలైజేషన్ అవుతుందా. ఇది కొత్త జ్ఞానం. జ్ఞానసాగరుడు, పతిత-పావనుడు, సర్వుల సద్గతిదాత అయిన తండ్రి ఎవరైతే ఉన్నారో వారే కూర్చొని అర్థం చేయిస్తారు. ఆ తరవాత వారిని ఎంతగానో మహిమ చేయండి. వారి మహిమను విన్నారా. ఆత్మ పరిచయాన్ని చెప్పాము, ఇప్పుడు పరమాత్మది కూడా చెప్తాము. వారిని సర్వాత్మలకు తండ్రి అని అంటారు. వారు చిన్నగా, పెద్దగా అవ్వరు. పరమపిత పరమాత్మ అనగా సుప్రీమ్ సోల్, సోల్ అనగా ఆత్మ. పరమాత్మ అయితే ఎంతో అతీతముగా ఉంటారు. వారు పునర్జన్మలలోకి రారు, అందుకే వారిని పరమపిత అని అనడం జరుగుతుంది. ఇంత చిన్నని ఆత్మలో పాత్ర నిండి ఉంది. పతిత-పావనుడు అని కూడా వారినే అంటారు. వారి పేరు ఎల్లప్పుడూ శివబాబాయే. రుద్రబాబా అని అనరు. భక్తి మార్గంలో అనేక పేర్లను పెట్టారు. వారిని అందరూ - పతితపావనా, మీరు వచ్చి పావనముగా తయారుచేయండి అని తలచుకుంటారు. కావున వారు తప్పకుండా రావలసి ఉంటుంది. ఎప్పుడైతే ఏక ధర్మ స్థాపన చేయవలసి ఉంటుందో, అప్పుడే వారు వస్తారు. అది ఆది సనాతన దేవీ దేవతా ధర్మం. ఇప్పుడు ఇది కలియుగము. లెక్కలేనంతమంది మనుష్యులు ఉన్నారు. సత్యయుగములో చాలా కొద్దిమంది మనుష్యులు ఉన్నారు. బ్రహ్మా ద్వారా స్థాపన, శంకరుని ద్వారా వినాశనము అన్న గాయనము కూడా ఉంది. గీత ద్వారానే ఆది సనాతన ధర్మము యొక్క స్థాపన జరిగింది. కేవలం అందులో కూడా పొరపాటున శ్రీకృష్ణుని పేరును వేసేసారు. తండ్రి అంటారు, అతను పునర్జన్మలలోకి వస్తారు, నేను పునర్జన్మ రహితుడను, కావున మీరే నిర్ణయించండి, పరమపిత పరమాత్మ నిరాకారుడైన శివుడా లేక శ్రీకృష్ణుడా? గీతా భగవంతుడు ఎవరు? భగవంతుడు అని ఒక్కరినే అంటారు. ఒకవేళ ఎవరైనా ఈ విషయాలను అంగీకరించకపోతే వారు మన ధర్మానికి చెందనివారు కాదు అని భావించాలి. సత్యయుగములోకి వచ్చేవారు వెంటనే అంగీకరిస్తారు మరియు పురుషార్థం చేయడం మొదలుపెడతారు. ముఖ్యమైన విషయం ఇదే. ఇందులోనే మీ విజయం ఉంది. కానీ దేహీ-అభిమాన అవస్థ ఎక్కడ ఉంది? పరస్పరం ఒకరి నామరూపాలలో ఒకరు చిక్కుకొని ఉంటారు. భక్తి మార్గంలో కూడా - పరబ్రహ్మములో ఉన్న ఆ పరమాత్ముడిని పొందాలి అన్న చింత ఉండేది అని అంటారు. ఇక భయం దేనికి? ఎంతో ధైర్యం కావాలి. భాషణ చేసేవారు ఆత్మ జ్ఞానాన్ని ఎంతో నషాతో ఇవ్వాలి. ఆ తరవాత పరమాత్మ అని ఎవరిని అంటారు అన్న విషయముపై కూడా అర్థం చేయించాలి. ప్రేమసాగరుడు, జ్ఞానసాగరుడు అన్నది తండ్రి మహిమ. అదే విధముగా పిల్లల మహిమ కూడా ఉంది. ఎవరిపైనైనా కోపగించడం అనగా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం. తండ్రి ఎంత మధురమైనవారు. పిల్లలు ఏదైనా విషయములో 'అవ్వదు, చెయ్యను' అని చెప్తే వారు కృష్ణుని వలె అవ్వరు. చాలా మధురముగా అవ్వాలి. అచ్ఛా.

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మీ బ్యాగ్ బ్యాగేజీ అంతా ట్రాన్స్ఫర్ చేసి చాలా సంతోషము మరియు నషాలో ఉండాలి. మమ్మా బాబా సమానముగా

సింహాసనాధికారులుగా అవ్వాలి. లోతైన స్మృతిలో ఉండాలి.

2. ఎవరికో భయపడి చదువును వదిలేయకూడదు. స్మృతి ద్వారా మీ కర్మ బంధనాలను తేలిక చేసుకోవాలి. ఎప్పుడూ క్రోధములోకి వచ్చి చట్టాన్ని చేతులలోకి తీసుకోకూడదు. ఏ సేవ చెప్పినా చేయను అని అనకూడదు.

వరదానము:- రాయల్ మరియు సింపుల్, రెండింటి బ్యాలెన్సుతో కార్యాన్ని చేసే బ్రహ్మాబాబా సమాన భవ

బ్రహ్మాబాబా సాధారణంగా ఉండేవారు, చాలా ఎక్కువగానూ ఉండేవారు కాదు, చాలా తక్కువగానూ ఉండేవారు కాదు. బ్రాహ్మణులకు ఆది నుండి ఇప్పటి వరకు గల నియమము ఏమిటంటే - బాగా సాధారణంగానూ ఉండకూడదు, బాగా రాయల్ గానూ ఉండకూడదు. మధ్యరకంగా ఉండాలి. ఇప్పుడు సాధనాలు చాలా ఉన్నాయి, సాధనాలను ఇచ్చేవారు కూడా ఉన్నారు, అయినా కూడా ఏదైనా కార్యాన్ని చేసినట్లయితే మధ్యరకంగా చెయ్యండి. ఇక్కడైతే రాజరికపు ఆడంబరాలు ఉన్నాయి అని ఎవ్వరూ అనకూడదు. ఎంత సింపుల్ గా ఉంటామో, అంత రాయల్ గా ఉండాలి, రెండింటి బ్యాలెన్సు ఉండాలి.

స్లోగన్:- ఇతరులను చూసేందుకు బదులుగా స్వయాన్ని చూసుకోండి మరియు గుర్తు ఉంచుకోండి - ‘‘ఏ కర్మను మనము చేస్తామో మనల్ని చూసి ఇతరులు చేస్తారు’’.

అవ్యక్త సైలెన్స్ ద్వారా డబుల్ లైట్ ఫరిశ్తా స్థితిని అనుభవము చెయ్యండి

ఇప్పుడు మీ మొత్తము కార్య వ్యవహారమంతా శ్రేష్ఠ సంకల్పాల ద్వారా, సూచనల ద్వారా నడవాలి. ఎంతటి లైట్ రూపంలో ఉండాలంటే వ్యర్థ సంకల్పాలు, వ్యర్థ సమయము సమాప్తమైపోవాలి. ఏదైతే జరగనున్నదో అదే సంకల్పము రావాలి మరియు ఎవరైతే అది చేయాలో, వారి బుద్ధిలో కూడా ఇదే చెయ్యాలి అని సంకల్పము కలగాలి, అప్పుడు ఈ సాకార వతనము సూక్ష్మ వతనముగా అవుతుంది.